చెత్త తొలగింపు



లక్సెట్టిపేట: 'అధికారుల ఫోజులు.. అటకెక్కిన పనులు' అనే శీర్షికన ఈ నెల 7న 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితం అయింది. కాగా ఎంపీడీవో సరోజ స్పందించి బుధవారం చెత్త కుప్పను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

సాక్షి స్పందన

గుంత పూడ్చారు.. బాధ తీర్చారు



భీమారం: 'ప్రమాదకరంగా గుంత' అనే శీర్షికన ఈ నెల 7న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి బుధవారం అధికారులు స్పందించారు. జాతీయ రహదారిపై ఏర్పడ్డ గుంతను గ్రామపంచాయతీ సిబ్బంది ద్వారా పూడ్చించారు. మట్టి కంకర పోసి రాకపోకలు సాఫీగా జరిగేటట్లు చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి' పలువురు కృతజ్ఞతలు చేశారు.

సాక్షి స్పందన

క్యాంటీన్ బోర్డులు తొలగింపు



మందమర్రిరూరల్: 'ఆర్టీసీ బస్టాండా.. క్యాంటీనా?' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో బుధవారం వచ్చిన కథనానికి ఆర్టీసీ మంచిర్యాల డిపో మేనేజర్(డీఎం) శ్రీనివాస్ స్పందించారు. మందమర్రి మార్కెట్లోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణానికి సిబ్బందితో వచ్చి బస్టాండ్ ముఖద్వారం, ముందువైపు గోడపై క్యాంటీన్ పేరిట ఉన్న బోర్డులను తొలగించారు. బస్టాండ్ ముఖద్వారంపై ఆర్టీసీ బస్టాండ్ అని పేరు రాయిస్తామని తెలిపారు. 'సాక్షి' కథనానికి స్పందించిన డీఎంకు పలువురు అభినందనలు తెలిపారు.

సాక్షి స్పందన

ఇది రోడ్డేనండి..!



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఏ మురికి కాలువనో.. మరేదో అనుకుంటే మీరు పొరపడినట్లే.. ఇది రోడ్డు అనేది వాస్తవం. మండలంలోని తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ వేణునగర్ కాలనీలోని రోడ్ల దుస్థితి ఇది. ఆ కాలనీలో ఏ వాడలో చూసినా పారిశుద్ధ్య లోపం, అధ్వానమైన రోడ్లు అధికారుల నిర్లక్ష్యపు పనితీరుకు అద్దం పడుతున్నాయి. అధికారులు స్పందించి పక్కా రోడ్లు చేపట్టి, పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. – తాండూర్

క్లుప్తంగా

విద్యుత్ అధికారుల 'పొలంబాట'



రచ్చపల్లిలో రైతులకు అవగాహన

చెన్నూర్‌రూరల్/లక్సెట్టిపేట: చెన్నూర్ మండలంలోని రచ్చపల్లిలో, లక్సెట్టిపేట మండలం కొమ్ముగూడెంలో విద్యుత్ అధికారులు బుధవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. బోరుబావుల వద్ద విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని రైతులకు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత లైన్‌మెన్లకు తెలియజేయాలని, సొంత నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమాల్లో కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ కొట్టె శ్రీనివాస్, లక్సెట్టిపేట ఏఈ గణేశ్, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'పొన్నం' వ్యాఖ్యలపై నిరసన



నిరసన తెలుపుతున్న ఎంహెచ్‌డీ శ్రేణులు

బెల్లంపల్లి: రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై సహచర మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు అభ్యంతరకరమని మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు అన్నారు. బెల్లంపల్లి కాంటా చౌరస్తా వద్ద బుధవారం నిరసన తెలిపారు. మంత్రి లక్ష్మణ్ కుమార్‌పై చేసిన అనుచిత వాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా శ్రేణులు రమేశ్, శేఖర్, గోగర్ల రమేశ్, టి.వెంకటేశ్, రాజ్‌కుమార్, కె.నవీన్, మల్లేష్ పాల్గొన్నారు.

క్షయపై అవగాహన



క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

నెన్నెల: క్షయ వ్యాధి నివారణకు నిర్ధారణే మార్గమని మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్, క్షయ వ్యాధి సూపర్‌వైజర్ శశికాంత్ అన్నారు. కోణంపేట, మన్నెగూడంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయవ్యాధి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రెహానా, టీబీ సూపర్‌వైజర్ సుశీల, హెల్త్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'న్యాయమూర్తిపై దాడి సరికాదు'



నినాదాలు చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై దాడిచేయడం సరికాదని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న అన్నారు. దాడిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మల్లయ్య, బీసీ మేధావుల ఫోరం ఉమ్మడి జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ రామోజీ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పలువురి బైండోవర్

దండేపల్లి: స్థానిక ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా దండేపల్లి మండలంలోని పలువురు పాత నేరస్తులకు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు ఎస్సై తహసీనొద్దీన్ పేర్కొన్నారు.

నిర్మాణ దశలోనే నిర్లక్ష్యం..!



నిర్మాణస్థలంలో పోసిన కంకర కుప్పలు

- శిథిలావస్థలో ఇరిగేషన్ కార్యాలయం
- నూతన భవనానికి నిధులు మంజూరు
- టెండర్ ప్రక్రియ పూర్తయి ఐదు నెలలైనా ముందుకు సాగని పనులు
- పాత భవనంలో భయంభయంగా విధులు నిర్వహిస్తున్న అధికారులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో ఇరిగేషన్ భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారులు, సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఎప్పుడు ఏ ప్రమాదం సంబవిస్తుందో అని జంకుతున్నారు. నూతన భవన నిర్మాణానికి ఐదు నెలల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియలో పనులు చేజిక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఇప్పటికీ పనులు ప్రారంభించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నాడు.



శిథిలావస్థకు చేరిన ఇరిగేషన్ కార్యాలయం

కడెం ఆయకట్టు మొత్తం ఇక్కడి నుంచి..

కడెం ప్రాజెక్టు ఆయకట్టు కింద వ్యవసాయ పనులకు ఇక్కడ ఇరిగేషన్ కార్యాలయం నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తారు. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాలకు మొత్తం 73కిలోమీటర్ల పొడవునా కాలువ నీటితో వ్యవసాయం సాగు చేస్తారు. కార్యాలయం శిథిలావస్థకు చేరడం, మౌళిక సదుపాయాలు, కనీస సౌకర్యాలు లేకపోవడంతో సిబ్బంది, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం ఊరుస్తుండడంతో రికార్డులు ఉంచడానికి అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని పనులను ప్రారంభించి, వేగవంతం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే..

మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయ భవనం 1960వ సంవత్సరంలో నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం ఇరిగేషన్ నిధులు రూ.33లక్షలను మే నెలలో మంజూరు చేసింది. జూలైలో భవనం నిర్మాణం కోసం సదరు కాంట్రాక్టర్, అధికారులు ముగ్గుపోసి, కొబ్బరికాయ కొట్టారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణ పనులు, కనీసం పిల్లర్లను కూడా ప్రారంభించలేదు. సంబంధిత అధికారులు ఎన్నిసార్లు చెప్పినా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని తెలుపుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..

సదరు కాంట్రాక్టర్‌కు పనులు ప్రారంభించకపోవడంతో నోటీసులు అందజేశాను. అయినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఇరిగేషన్ ఈఈ ప్రవీణ్‌కుమార్‌కు వ్రాత పూర్వకంగా విన్నవించాను. త్వరలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని వివరించారు.

– దశరథ్, ఇరిగేషన్ డీఈ, లక్సెట్టిపేట

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన



ఎంపీడీవోతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

భీమారం/కాసిపేట: కాసిపేట ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారులు పరిశీలించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్ల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నిగ్ అధికారి పురుషోత్తం నాయక్, ఎంపీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సాంబమూర్తి, రాథోడ్ రమేశ్, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సబ్దర్‌అలీ, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. భీమారం మండల పరిషత్ కార్యాలయాన్ని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్వేత పరిశీలించారు. మండలంలో రెండో విడుతలో ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. నామినేషన్ వేసే కేంద్రానికి 100మీటర్ల వరకు గుంపులు గుంపులుగా ఉండొద్దని ప్రజలకు సూచించారు. పోలింగ్‌స్టేషన్ల వివరాలను ఎంపీడీవో మధుసూదన్‌ను అడిగి తెలుసుకున్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి



అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్‌నాయక్

కాసిపేట: వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ముత్యంపల్లి డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ అన్నా రు. మండలంలోని మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలలో బుధవారం జాతీయ వన్యప్రాణి వారో త్సవాల్లో భాగంగా విద్యార్థులకు వన్యప్రాణు ల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కా ర్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివా స్, ఉపాధ్యాయులు హరినాయక్, శంకర్, బీ ట్ అధికారి శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

రామకృష్ణాపూర్: వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని తవక్కల్ పాఠశాలలో బుధవారం వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ సమతుల్యతపై డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ రాజేశ్వరి, రమేష్, రజిత, శ్రవణ్, పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

భీమారం: మండలంలోని అంకుసాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఉమెన్స్ హబ్ జెండర్ లిప్సిక మాట్లాడుతూ.. ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతీ గర్భిణిని అంగన్‌వాడీలకు ఆహ్వానించి, అందరి సమక్షంలో సీమంతం చేయడం ఆ గర్భిణులు మర్చిపోలేని విషయమన్నారు. తల్లిపాల విశిష్టత గురించి సూపర్‌వైజర్ పద్మ వివరించారు. గర్భిణులకు గాజులు, బట్టలు పెట్టి సీమంతం చేశారు. భీమారం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

చెట్లు ఎర్రగా.. పత్తి నల్లగా



నెన్నెలలో ఎర్రబారిన పత్తి చేను

నెన్నెల: అకాల వర్షాలకు పత్తి చేళల్లో నీరు నిల్వడంతో చెట్లు ఎర్రబారి, పత్తి నల్లగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అప్పులు చేసి పండించిన పంట ఆశించిన మేర దిగుబడి రాకపోతే రుణాలు తీర్చడం కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా వర్షాలు కురుస్తుండటంతో పత్తి పంట మొత్తం ఎర్ర తెగులుతో పాటు జాలువారి ఆకులు రాలి పైరు ఎండిపోతుంది. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆదమరిస్తే..అంతే!



దండేపల్లి: లక్సెట్టిపేట–నిర్మల్ రహదారిపై దండేపల్లి మండల కేంద్రం సమీపంలో నర్సాపూర్ క్రాసింగ్ వద్ద రోడ్డుపై పెద్ద గుంత పడింది. గుంతపై చెట్ల నీడ పడటం, పైగా వర్షం నీళ్లు నిలిచి ఉండటంతో వాహనదారులకు అది కనిపించడం లేదు. ఏమాత్రం ఆదమరిచినా ఎగిరిపడుతున్నారు. వారం రోజుల వ్యవధిలో చాలా మంది వాహనదారులు కిందపడిన ఘటనలు చోటు చేసుకున్నాయి. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

చెట్టును తలపిస్తున్న విద్యుత్ స్తంభం



మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడలో పెట్రోల్‌బంక్ వద్ద విద్యుత్ స్తంభానికి పిచ్చిమొక్కలు అల్లుకొని చెట్టును తలపిస్తుంది. తీగలతో విద్యుత్ సరఫరాకు తరుచూ అంతరాయం ఏర్పడుతుంది. ఈ మొక్కలను ఆవులు తినేందుకు వచ్చి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బొగ్గుబాయి వార్తలు

నియామకాల్లో జాప్యం

శ్రీరాంపూర్: సింగరేణి కారుణ్య నియామకాల్లో జాప్యం చేస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7నెలలుగా కారుణ్య నియామకాలు ఆగిపోయాయన్నారు. ఈ జాప్యం వల్ల వారి సర్వీసు నష్టపోతారని యాజమాన్యం స్పందించి పోస్టింగ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉచిత శిక్షణ

శ్రీరాంపూర్: వోల్వో, డంప్ ట్రక్ ఆపరేటర్ కోసం కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి పాసై హెవీ గూడ్స్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న వారికి అవకాశం కలదన్నారు. పూర్తి వివరాలకు శ్రీరాంపూర్‌లోని ఎంవీటీసీలో ఈనెల 10లోగా సంప్రదించి దరఖాస్తులు సమర్పించాల్సిందిగా సూచించారు.

ఐఎన్‌టీయూసీతోనే హక్కుల సాధన

శ్రీరాంపూర్: ఐఎన్‌టీయూసీతోనే కార్మికుల హక్కులు సాధ్యమని ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు తెలిపారు. ఆర్కే 5గనిలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ సభ్యత్వాన్ని చెల్లించి యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు తిరుపతి రాజు, ఏనుగు రవీందర్ రెడ్డి, పిన్నింటి మల్లారెడ్డి, రామకృష్ణ, మహేందర్ రెడ్డి, శ్రీధర్, యాదగిరి పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో ఐఎన్‌టీయూసీ నాయకులు

'చరిత్రలో నిలిచిపోయే హక్కులు సాధించాం'

శ్రీరాంపూర్: సింగరేణి చరిత్రలో నిలిచిపోయే హక్కులు సాధించామని టీబీజీకేఎస్ నాయకులు తెలిపారు. ఆ యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేశ్‌లు బుధవారం ఆర్కే 7 గనిపై సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. యూనియన్ బలోపేతం, మెరుగైన నిర్వహణ కోసం కార్మికులు సభ్యత్వ రుసుం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు పానుగంటి సత్తయ్య, పెట్టం లక్ష్మణ్, వెంగళ కుమార్‌స్వామి, బ్రాంచీ నాయకులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నేతలు

సంక్షిప్త వార్తలు

క్రీడాపోటీలు ప్రారంభం

లక్సెట్టిపేట: విద్యార్థులకు క్రీడా పోటీలు చాలా అవసరమని ఎంఈవో శైలజ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి తైక్వాండో క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

నెన్నెల: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో కిరాయిలు లేక తీవ్రంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ అధ్యక్షుడు మహ్మద్ హబీబ్ పాషా డిమాండ్ చేశారు. నెన్నెల తహసీల్దార్ పిప్పిరి శ్రీనివాస్‌కు బుధవారం ఆటో డ్రైవర్లతో కలిసి ఆయన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.

ఇంటింటా బాకీ కార్డుల పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీలో ఇంటింటికీ తిరిగి బీఆర్‌ఎస్ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని, ఆ గ్యారంటీలు అబద్ధమని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు నడిపెల్లి విజిత్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతులు

దండేపల్లి: మండలంలోని గూడెం, వెల్గనూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. విద్యుత్ అంతరాయాన్ని తొలగించేందుకు బుధవారం ఏడీఈ ప్రబాకర్‌రావు ఆదేశాల మేరకు ముందస్తు మరమ్మతులు చేశారు. అవసరం ఉన్న చోట ఇన్సులెటర్లు మార్చారు.

కమిషనర్‌కు వినతి

పాతమంచిర్యాల: శ్రీరాంపూర్‌లోని ఆరో డివిజన్ 17వ వార్డులో కటికె దుకాణం నుంచి పోచమ్మ గుడి వరకు రోడ్డు పూర్తిగా చెడిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మాజీ కౌన్సిలర్ మేకల దాసు అన్నారు. మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్ సంపత్‌కుమార్‌ను బుధవారం కలిసి రోడ్డు నిర్మించాలని వినతిపత్రం అందించారు.

ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక

కోటపల్లి: బాలుర ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టుకు అండర్ 19విభాగంలో కోటపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థి సుకుమార్ అత్యంత ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్‌తో పాటు సిబ్బంది అభినందిచారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

దండేపల్లి: టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 15మంది క్షయ వ్యాధి గ్రస్తులకు బుధవారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. వైద్యుడు సతీష్, టీబీ సూపర్‌వైజర్ సురేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాతమంచిర్యాల: భవన నిర్మాణ కార్మిక సంఘం మంచిర్యాల, వేమనపల్లి కార్మికుల ఆధ్వర్యంలో సేకరించిన రూ.10వేల ఆర్థిక సాయాన్ని గొర్లపల్లి గ్రామానికి చెందిన సుతారి మేస్త్రీ పాయిలి లచ్చన్న కుటుంబానికి అందించారు.